కొండపాక క్వారీ వద్ద మాట్లాడుతున్న ఇసుక లారీ డ్రైవర్లు

లారీ డ్రైవర్ల అరిగోస

- వారం రోజులుగా ఇసుక కోసం క్వారీ వద్ద పడిగాపులు

వీణవంక, మార్చి 26: డీడీ కట్టిన 24 గంటల్లో ఇసుకను పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం, వారం గడుస్తున్నా ఇసుక లోడ్ చేయక పోవడంతో క్వారీ వద్ద లారీ డ్రైవర్లు అరిగోస పడుతున్నారు. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని కొండపాక ఇసుక క్వారీకి వారం రోజుల క్రితం ఆయా జిల్లాలకు చెందిన సుమారు 50 లారీలు లోడ్ కోసం వెళ్లాయి. నిర్వాహకులు క్వారీని మూసివేయడంతో వారం రోజులుగా లారీ డ్రైవర్లు పడిగాపులు కాస్తున్నారు. క్వారీ నిర్వాహకులు, అధికారులను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడంలేదని, వారం రోజులుగా కాలువలో నీళ్లుతాగి జీవనం గడుపుతున్నామని లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. డీడీలు వేరే క్వారీకి మార్చాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాళ్లమొక్కినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని డీడీలు కట్టిన వారికి ఇసుక లోడ్ అయ్యేలా చూసి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై టీఎస్ ఎండీసీ పీవోను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

అంబేద్కర్ జయంతి కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

మారేపల్లి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎస్సీకార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

హుజూరాబాద్ టౌన్, మార్చి 26: అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా మారేపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. పట్టణంలోని బీఎస్ఆర్ గార్డెన్‌లో అంబేద్కర్ జయంతి కమిటీ మాజీ చైర్మన్ మహ్మద్ ఖాలిక్ హుస్సేన్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆలేటి రవీందర్, రుద్రారపు రామచంద్రం, బొరగాల సారయ్య, డాక్టర్ తడికమళ్ల శేఖర్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్షుడిని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమానికి ప్రజాసంఘాల నాయకులు సొల్లు బాబు, కొండ్ర నరేశ్, కొలిపాక శంకర్, చందుపట్ల జనార్ధన్, వేల్పుల రత్నం, ఎర్ర రమేశ్, తునికి సమ్మయ్య, తునికి వసంత్, ఎర్ర శ్రీధర్, రొంటాల రాజ్ కుమార్, ఉప్పు శ్రీనివాస్ హాజరై శ్రీనివాస్ ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు.

6 నుంచి చలివేంద్రం ప్రారంభం

తెలంగాణచౌక్, మార్చి 26: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏప్రిల్ 6 నుంచి చలివేంద్రం ప్రారంభిస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవా సంస్థల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాల్తేపు లింగమూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డిని కలిసి చలివేంద్రాల అనుమతి కోసం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కేంద్రంతో పాటు జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, హుజూరాబాద్, జమ్మికుంట, పెద్దపల్లి, గోదావరిఖని బస్టాండ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు మినరల్ వాటర్ అందిస్తామని తెలిపారు. ఇక్కడ సేవా సంస్థల సభ్యులు లక్ష్మణ్‌రావు, కన కయ్య, రాంరెడ్డి, లక్ష్మీపతి ఉన్నారు.

'టాస్క్'ను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మికుంట, మార్చి 26: ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షల్లో రాణించేలా కళాశాలలో రెండు రోజుల పాటు తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జీ(టాస్క్) ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ పిలుపునిచ్చారు. కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ శిక్షణ విద్యార్థులు రాసే అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడతాయని తెలిపారు. ఇక్కడ వైస్ ప్రిన్సిపాల్ ఓదెలుకుమార్, టాస్క్ కో-ఆర్డినేటర్ ఉమాకిరణ్, అధ్యాపకులు ఉన్నారు.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మార్చి 26 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించాలని, కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె అట్రాసిటీ కేసుల నమోదు, పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం, తదితర అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో కేసు పూర్వపరాలు పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల్లో భాగంగా అవసరమైన కుల ధ్రువీకరణ పత్రం వీలైనంత త్వరగా జారీ చేయాలని సూచించారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. చింతకుంటలోని అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తేవాలని, భగత్ నగర్‌లో కేటాయించిన స్థలానికి ప్రహరీ నిర్మించాలని సభ్యులు కోరారు. కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహ కూడలి శుభ్రంగా ఉంచాలన్నారు. వీటిని వెంటనే పరిశీలించాలని సంబంధితాధికారులను ఆమె ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, అట్రాసిటీ కేసుల విషయంలో శరవేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డీటీడీవో జనార్దన్, బీఎం డబ్ల్యూ పవన్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్ ప్రకాశ్, ఏసీపీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లోనే ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

కమాన్‌చౌరస్తా, మార్చి 26: శాతవాహన యూనివర్సిటీకి అనుబంధంగా మంజూరైన ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను కరీంనగర్‌లోని యూనివర్సిటీలోనే ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ కోరారు. ఈ మేరకు బుధవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇంజినీరింగ్ కళాశాల యూనివర్సిటీలో ఏర్పాటు చేయని పక్షంలో విద్యార్థులను ఏకం చేసి ఉద్యమిస్తామని, ఆమరణ నిరాహార దీక్షకు సైతం వెనుకాడమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర అధ్యక్షుడు కేశపోయిన రాము యాదవ్, ఉపాధ్యక్షుడు సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ఏర్పాటు చేస్తే ఆందోళనలు తప్పవు

ఎస్‌యూకు అనుబంధంగా మంజూరైన ఇంజినీరింగ్ కళాశాలను కరీంనగర్‌లోనే ఏర్పాటు చేయాలని శాతవాహన యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు వీసీని కలిసి కోరారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు నైతం మహేశ్ మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన ఇంజినీరింగ్ కళాశాలను స్వలాభం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌కు తరలించడాన్ని కరీంనగర్ విద్యార్థి లోకం ఎప్పుడూ క్షమించదన్నారు. ఇంజినీరింగ్ కళాశాల హుస్నాబాద్‌లో ఏర్పాటు చేస్తే ఆందోళనలు తప్పవని తేల్చిచెప్పారు.

బేబీ శరణ్యకు ప్రముఖుల అభినందన

కమాన్‌చౌరస్తా, మార్చి 26 : కరీంనగర్‌లోని మాస్క్ ఇనిస్టిట్యూట్‌లో నటనలో శిక్షణ పొంది ఈ సంవత్సరం జీ తెలుగు చానెల్‌లో నిర్వహించిన డ్రామా జూనియర్స్ సెలక్షన్‌లో ఎంపికైన బేబీ శరణ్యను ప్రముఖ హాస్య నటుడు ఆర్ఎస్ నంద, కరీంనగర్ జిల్లాకు చెందిన కళాకారులు అభినందించారు. మాస్క్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నగర స్వర్ణకార సంఘ భవనంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆర్ఎస్ నంద, ఇనిస్టిట్యూట్ చైర్మన్, యాక్టింగ్ కోచ్ అనసూరి భూనాథాచారి మాట్లాడుతూ, ఎంతో పోటీ ఉన్నా మన మన ప్రాంతం అమ్మాయి అవకాశాన్ని దక్కించుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వంగల శ్రీధర్, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రావుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస్, కళాకారులు పాల్గొన్నారు.

కంపోస్ట్ యార్డు పరిశీలన

హుజూరాబాద్ టౌన్, మార్చి 26: స్వచ్ఛ సర్వేక్షణ్-2025 కార్యక్రమంలో భాగంగా హుజూరాబాద్ మున్సిపల్ పరిధి ఇప్పల్ నర్సింగాపూర్‌లోని కంపోస్ట్ యార్డును బుధవారం కంపోస్ట్ డెవలప్‌మెంట్ అధికారి హేమలత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తడి చెత్త నుంచి ఎరువుల తయారీ విధానం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఇక్కడ కమిషనర్ సమ్మయ్య, సిబ్బంది ఉన్నారు.

అనుమతి లేని స్కానింగ్ సెంటర్ సీజ్

విద్యానగర్, మార్చి 26: కరీంనగర్‌లోని శ్రీలత మెటర్నటీ నర్సింగ్ హోంలో బుధవారం మొబైల్ అల్ట్రా సౌండ్ మిషన్‌ను వైద్యాధికారులు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. శ్రీలత నర్సింగ్ హోంకు తనిఖీకి వెళ్లిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, స్కానింగ్‌కు అనుమతి లేదని గుర్తించారు. వెంటనే మిషన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. స్కానింగ్ కోసం రోజుకు ఎంతమంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అనుమతి లేకుండా నడిపిస్తున్న స్కానింగ్ సెంటర్లపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే 3 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా తప్పదని హెచ్చరించారు. తనిఖీల్లో ఆర్ఐ రాములు, ఏఎస్ఐ విజయ మణి, జూనియర్ అసిస్టెంట్ బాపుదేవ్, వైద్యాధికారులు ఉమశ్రీ, సనా జవేరియా, సఖీ కన్సల్టెంట్ లక్ష్మి, డెమో రాజగోపాల్ పాల్గొన్నారు.

29న ఉద్యోగ మేళా

కమాన్‌చౌరస్తా, మార్చి 26 : జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని ముత్తూట్ మైక్రో ఫిన్ లిమిటెడ్‌లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 29న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వై తిరుపతి రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో రిలేషన్‌షిప్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులకు రూ. 16 వేల నుంచి 23 వేల వరకు వేతనం ఉంటుందని, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. 20 నుంచి 28 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు శనివారం ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో కశ్మీర్‌గడ్డలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 93465 84572/ 72076 59969/ 99082 30384లో నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

రంజాన్ తోఫా అందించాలి

కలెక్టరేట్, మార్చి 26 : రాష్ట్రంలో ఏడాది నుంచి నిలిచిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం తిరిగి చేపట్టాలని, నిరుపేద ముస్లింల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.రఫీయొద్దీన్ డిమాండ్ చేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని బుధవారం కార్ఖానాగడ్డలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నగరంలోని పేద ముస్లింలకు రంజాన్ సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన అనంతరం గత తొమ్మిదేళ్లుగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు ఏటా రంజన్ తోఫా అందించి, ముస్లింల పట్ల ఆప్యాయతను చాటుకున్నారన్నారు. దానిని యథావిధిగా కొనసాగించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకంపై నీళ్లు చల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఇష్తేకార్ అహ్మద్, రజియా సుల్తానా, సయ్యద్ సలీం, ఎండి.షుకూర్, రహమతుల్లాతో పాటు పలువురు పాల్గొన్నారు.

త్వరలో విగ్రహాల ఆవిష్కరణ

జేఏసీ నాయకులతో దీక్ష విరమింపజేస్తున్న బక్కి వెంకటయ్య

తిమ్మాపూర్, మార్చి 26: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను త్వరలో ఆవిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. గత కొన్ని రోజులుగా విగ్రహాల ఆవిష్కరణ కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలను విరమింపజేశారు. జేఏసీ కన్వీనర్లు, దళిత సంఘాల నాయకులకు నిమ్మరసం తాగించారు. మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కోసం పార్టీలకతీతంగా జేఏసీగా ఏర్పాటై పోరాటం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్లు మాతంగి శంకర్, దుండ్ర రాజయ్య, వంతడుపుల సంపత్, సుగుర్తి జగదీశ్వరాచారి, ల్యాగల వీరారెడ్డి, వడ్లూరి శంకర్, మాతంగి లక్ష్మణ్, పాశం అశోక్‌రెడ్డి, బోయిని తిరుపతి, మాచర్ల అంజయ్య, కనకం రాములు, మేడి అంజయ్య, ఎలుక ఆంజనేయులు, సముద్రాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి దుకాణంలో దొంగలు

తిమ్మాపూర్, మార్చి 26: మిర్చి దుకాణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని తిమ్మాపూర్ మిర్చి యార్డు దుకాణా యజమాని మడికంటి శ్రీనివాస్ మంగళవారం రాత్రి షాప్‌ను మూసివెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి షెట్టర్ తెరవగా వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పాటు కౌంటర్ తాళాలు పగలగొట్టి ఉంది. దీంతో కౌంటర్ ఉన్న డబ్బు సుమారు రూ.45వేలు అపహరించారని గ్రహించిన ఆయన ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ వివేక్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చోరీ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. 4, 5 దొంగలు అర్ధరాత్రి సమయంలో వెనుక నుంచి గోడ దూకి దుకాణంలోకి చొరబడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. కమిషనరేట్ నుంచి క్లూస్ టీం పోలీసులను రప్పించి ఆధారాలు సేకరించారు. దుకాణా యజమాని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

అన్నారంలో నాలుగు ఇండ్లల్లో చోరీ

మానకొండూర్ రూరల్, మార్చి 26: మండలంలోని అన్నారం గ్రామంలో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు ఇండ్లల్లో ఒక్క రోజే దొంగతనం జరుగడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. స్థానికులు, మానకొండూర్ పోలీసులు తెలిపిన వివరాలు.. మానకొండూర్ మండలం అన్నారం గ్రామంలో మంగళవారం రాత్రి పాకాల రాజిరెడ్డి, రుద్రోజు వెంకన్న, వెంకటమ్మ, గొట్టిముక్కల వీరారెడ్డి ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ఆయా ఇండ్లల్లో వెండి, బంగారు నగలతో పాటు పాకాల రాజిరెడ్డికి చెందిన ద్విచక్ర వాహనాన్ని సైతం దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు బుధవారం ఉదయం సీఐ లక్ష్మీనారాయణ గ్రామానికి చేరుకొన్నారు. చోరీ జరిగిన ఇండ్లను క్లూస్ టీమ్‌తో పరిశీలించి, వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసుకు సమాచారం అందించాలని కోరారు. ఇండ్లల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మార్చి 26: ఏబీ స్విచ్, కొత్త డీటీఆర్, లైన్ పనులతో పాటు విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2 ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎం లావణ్య వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 11.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జ్యోతినగర్ కుర్మవాడ, కోర్టు వాటర్ వర్క్స్ ప్రాంతాలకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాజీవ్ చౌక్, రూరల్ పోలీస్ స్టేషన్, భారత్ టాకీస్ ఏరియా, టవర్ సర్కిల్, బ్రాహ్మణ స్ట్రీట్, అహ్మద్ పుర, ద్వారక నగర్, వాల్మీకి నగర్ ప్రాంతాలకు, సాయంత్రం 4 నుంచి 4.46గంటల వరకు శక్తి టెంపుల్ ఏరియా, బాలాజీ సూపర్ మార్కెట్ ఏరియా, శ్రీరామ ఫంక్షన్ హాల్, భాగ్యనగర్, వీరభద్ర అపార్ట్‌మెంట్, గీతాభవన్ వెనుక ప్రాంతం, కార్పెంటర్ సొసైటీ, సంతోష్ మాత టెంపుల్ ఏరియా, న్యూ లేబర్ అడ్డా, సాయిబాబా టెంపుల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

హుజూరాబాద్ టౌన్, మార్చి 26: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నుంచి జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా దేవి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో రెండు రోజుల పాటు కొనసాగే ఈ సదస్సులో విద్యావిధానం, భారతీయ జ్ఞానపరంపర ఏకీకరణ, ఆవిష్కరణలు, వ్యవస్థాపకతపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా అది మల్లేశం పటేల్

తెలంగాణచౌక్, మార్చి 26: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నగరానికి చెందిన అది మల్లేశం పటేల్ నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం నగరంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లేశం పటేల్ మాట్లాడుతూ, మున్నూరు కాపుల ఐక్యత, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో సంఘం నాయకులు శ్రీనివాస్, లింగమూర్తి, సునీల్, నితిన్ పాల్గొన్నారు.

ఈపీఎస్ పెన్షనర్ల ధర్నాకు తరలాలి

కలెక్టరేట్, మార్చి 26 : ఈపీఎస్ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం సాచివేత ధోరణి అనుసరిస్తుండడాన్ని నిరసిస్తూ, ఈనెల 28న హైదరాబాద్ బర్కత్‌పుర లోని ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న భారీ ధర్నాకు జిల్లానుంచి పెద్ద ఎత్తున పెన్షనర్లు తరలిరావాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్స్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష,కార్యదర్శులు సిహెచ్.జనార్ధన్, జి.అశోక్ తెలిపారు. పెన్షన్ పెంచేందుకు కేంద్రం అంగీకరించిందంటూ కొంతమంది పెన్షనర్ల సంఘాల నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిని విశ్రాంత ఉద్యోగులు నమ్మకూడదన్నారు. ప్రభుత్వోద్యోగులకు కనీస వేతనం రూ.18వేలు ఇస్తున్నట్లుగానే, పెన్షనర్లకు కూడా కనీస పెన్షన్ రూ.9వేలకు పెంచాలనే డిమాండ్‌తో ధర్నా తలపెడుతున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

బాల సదన్, శిశుగృహల సందర్శన

శిశుగృహను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్

కోర్టుచౌరస్తా, మార్చి 26: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్ ఆధ్వర్యంలో నగరంలోని బాల సదన్, శిశుగృహను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులతో ముచ్చటిస్తూ కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు, అనంతరం బాలసదన్, శిశు గృహాలోని వంట, ఆహార పదార్థాలను నిలువచేసే గదులను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

సమాచార కమిషన్‌కు ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, మార్చి 26: తన భూమికి సంబంధించిన వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా అధికారులకు దరఖాస్తు చేసినా స్పందించడం లేదని బొమ్మకల్‌కు చెందిన గోష్కి శంకర్ బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బొమ్మకల్‌లోని తన భూమికి సంబంధించిన వివరాల కోసం కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌కు 20 డిసెంబర్ 2024న, ఆర్డీవోకు 4 ఫిబ్రవరి 2025న దరఖాస్తు చేశానని, దీనిపై ఆర్డీవో 7 ఫిబ్రవరి 2025న సమాచారం అందించాలని సంబంధిత తహసీల్దార్‌కు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని వివరించారు. తాను కోరిన సమాచారం వెంటనే ఇప్పించడంతోపాటు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

బెల్ట్‌షాపులపై దాడులు

కొత్తపల్లి, మార్చి 26 : మండలంలోని బావుపేట, ఎలగందుల గ్రామాల్లో కొత్తపల్లి పోలీసులు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కొత్తపల్లి ఎస్‌హెచ్‌వో, ప్రొబేషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్ బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. బావుపేట, ఎలగందుల గ్రామాల్లో రెండేసీ బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి రూ.26,280 విలువైన 40.735 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన

కరీంనగర్ రూరల్, మార్చి 26: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం 'మత్తు పదార్థాల వినియోగం- వాటి వల్ల అనర్థాలు' అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ రెండో టౌన్ సీఐ పీ లక్ష్మి హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు.

సతాయించిన సర్వర్.. సర్టిఫికేట్ల కోసం ఇక్కట్లు

తహసీల్ కార్యాలయంలో సర్టిఫికేట్ల కోసం నిరీక్షిస్తున్న బాధితులు

మానకొండూర్ రూరల్, మార్చి 26: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ద్రువీకరణ పత్రాల కోసం తహసీల్ కార్యాలయానికి వివిధ గ్రామాల నుంచి జనం తరలివస్తున్నారు. కులం, ఆదాయం, నివాసం, ఇంకా పలు సర్టిఫికేట్ల కోసం మీ సేవ సెంటర్లో ఆన్‌లైన్ చేసుకొని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అప్పగించారు. బుధవారం సర్టిఫికేట్లకు సంబంధించిన సైట్, సర్వర్ సతాయించడంతో సర్టిఫికేట్ల కోసం అనేక మంది గంటల తరబడి నిరీక్షించి వెనుదిరిగారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక పండుగలు

మాజీ సర్పంచ్ నజీర్‌కు ఖర్జూరా తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, మార్చి 26: భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలకు పండుగలు ప్రతీకగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని నారాయణపూర్ మాజీ సర్పంచ్ ఎండీ నజీర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జామా మసీద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఖర్జూరా తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు సాగి మహిపాల్‌రావు, మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, కంకణాల విజేందర్‌రెడ్డి, శ్రీమ